# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-06-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **జార్ఖండ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలోని ఏడు జిల్లాల మీదుగా వెళ్లే రెండు రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**
2. **సూపర్ సిక్స్ అమలులో భాగంగా తల్లికి వందనం పథకం నిధులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు విడుదల చేస్తారు.**
3. **అన్నదాత సుఖీభవ నగదును ఈ నెల 20వ తేదీన రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**
4. **రక్షణశాఖ సహకారంతో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను పునః ప్రారంభించనున్నామని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.**
5. **వేసవి సెలవులు ముగియడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ రోజు నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి.**

==========================

జార్ఖండ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలోని ఏడు జిల్లాల మీదుగా వెళ్లే రెండు రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన నిన్న మంత్రివర్గ సమావేశమైంది. ఆ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. కోదర్మ బర్కాకానా రైల్వే మార్గం డబ్లింగ్ చేసే ప్రాజెక్టు కోసం 3 వేల 63 కోట్ల రూపాయలను కేటాయించామని వివరించారు. అలాగే బళ్లారి-చిక్ జాజూర్ రైల్వే మార్గం డబ్లింగ్ కోసం 3 వేల 342 కోట్ల రూపాయలను మంజూరు చేశామన్నారు. బళ్లారి-చిక్లూర్ డబ్లింగ్ రైల్వే మార్గం 185 కిలోమీటర్లుగా నిర్మాణం సాగుతుందని అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ..

వాయిస్ .. 26 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఈ రోజుతో ఏడాది పూర్తవుతున్న సందర్భంగా 'సుపరిపాలన స్వర్ణాంధ్రప్రదేశ్' పేరుతో ప్రభుత్వం ఉత్సవం నిర్వహిస్తోంది. కృష్ణా జిల్లా పోరంకిలో జరిగే ఈ కార్యక్రమంలో ఈ ఏడాది కాలంలో ప్రభుత్వ పాలన, రాబోయే నాలుగేళ్ల లక్ష్యాలు వంటి అంశాలపై ప్రజలకు వివరించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్‌తో పాటు రాష్ట్ర మంత్రులందరూ కార్యక్రమంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

మరో వైపు సూపర్ సిక్స్ అమలులో భాగంగా తల్లికి వందనం పథకం నిధులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు విడుదల చేయనున్నారు. 67 లక్షల 27 వేల మంది తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం 8,745 కోట్ల రూపాయలు జమ చేయనుంది. కాగా ఈ ఏడాది ఒకటవ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ లో చేరిన వారికీ తల్లికి వందనం అమలు చేయనున్నారని అధికారులు తెలిపారు.

---------------------------

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్పిడి చేసుకునేందుకు ఉద్దేశించిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూముల చట్టం 2006- నాలా చట్టంను రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. రెవెన్యూ శాఖలో సంస్కరణల కోసం ఆరుగురు మంత్రులతో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న సమావేశమై పలు అంశాలపై చర్చించింది. ప్రజలకు ఇబ్బందిగా మారిన నాలా చట్టం రద్దు చేయాలని నిర్ణయించినట్లు ఆర్థిక మంత్రి తెలుపుతూ,

..వాయిస్... 28 సెకన్లు

---------------------------

విశాఖపట్నంలో పౌర విమానయాన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ భవనాల నిర్మాణ పనుల పురోగతిపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, విజయవాడ, విశాఖతో పాటు.. రాష్ట్రంలోని వివిధ విమానాశ్రయాల నుంచి జాతీయ, అంతర్జాతీయ నగరాలకు కనెక్టివిటీ పెంచేలా ప్రణాళికలను రూపొందించాలని సూచించారు.

---------------------------

అన్నదాత సుఖీభవ నగదును ఈ నెల 20వ తేదీన రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. ఏలూరు జిల్లాలో పర్యటించిన మంత్రి నిన్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ 32 సెకన్లు

---------------------------

వేసవి సెలవులు ముగియడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ రోజు నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. పాఠశాలలు ప్రారంభమవుతున్న దృష్ట్యా విద్యా శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో బడులు ప్రారంభమైన తొలిరోజే విద్యార్థులకు 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు' పంపిణీ చేయనున్నారు. ఈ కిట్‌లో ఒక్కో విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, వర్క్ నోట్ పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు, 3 జతల ఏకరూప దుస్తులు, అందించనున్నారు.

---------------------------

రక్షణశాఖ సహకారంతో శ్రీశైలం ఎడమగట్టు కాలువ-ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వకం పనులను పునఃప్రారంభించనున్నామని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో కేంద్ర

రక్షణశాఖ అధికారులతో మంత్రి నిన్న సమావేశమై సొరంగమార్గం భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, సొరంగంలో ప్రమాదం జరిగిన తర్వాత పనులను ఎలా కొనసాగించాలన్న అంశంపై అధ్యయనం చేయడానికి 8 మంది నిపుణులతో కమిటీ వేశామని, వారి సూచనలతో పనులు కొనసాగించడానికి కేంద్ర రక్షణశాఖ సాయం కోరామని తెలిపారు.

---------------------------

దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పాలన సాగిందని రాజ్యసభ మాజీ సభ్యులు జి.వి.ఎల్.నరసింహారావు అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ప్రధానమంత్రి మోదీ 11 సంవత్సరాల పాలనపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనా సంస్కరణలతో ప్రపంచంలో 4వ ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణాలకు అధిక మొత్తంలో నిధులు కేటాయించిందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...22 సెకన్లు

తెలంగాణాలోని పలు జిల్లాల్లో రానున్న నాలుగు రోజులపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

---------------------------

తెలంగాణలోని అన్ని మండలాల్లో రైతుల అవసరాలకు తగిన ఎరువులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో వర్షాకాలంలో ఎరువులు, విత్తనాల పంపిణీపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి జిల్లాలోను నేలకు సరిపడే ఎరువుల ముందస్తుగానే జిల్లా కేంద్రంలో నిల్వ చేయాలన్నారు. కల్తీ విత్తనాల విషయంలో చాలా కఠినంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు.

---------------------------

పారిశ్రామిక అభివృద్ధితో పాటు కార్మిక భద్రతకు ప్రాధాన్యమిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. విజయవాడలో భారత ప్రమాణాల సంస్థ –బిఐయస్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు సురక్షిత వాతావరణాన్ని కల్పించాలన్నారు. తద్వారా పరిశ్రమల యాజమాన్యానికి ఆస్తి నష్టం ప్రాణనష్టం జరగకుండా నివారించవచ్చని తెలిపారు.

---------------------------

స్వర్ణాంధ్ర 2047 కార్యాచరణ ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోరారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు పురపాలక కార్యాలయంలో స్వర్ణాంధ్ర 2047 కార్యాచరణ ప్రణాళిక అమలుపై నిన్న మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.

=====================